# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాజధానికి భూములిచ్చిన రైతుల వల్లే అమరావతి నిర్మాణం సాధ్యమైందన్న ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు.**
2. **రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఈరోజు సమావేశమైంది.**
3. **పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందన్న మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి.**
4. **గోదావరి పుష్కరాలకు అనుగుణంగా తూర్పుగోదావరి జిల్లాలోని రహదారులను అభివృద్ధి చేయాలన్న రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి.**
5. **ఈనెల 30వ తేదీన ప్రసారం కానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం.**

========================

రాజధానికి భూములిచ్చిన రైతుల వల్లే అమరావతి నిర్మాణమవుతోందని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అమరావతిలోని వెంకటపాలెంలో తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణకు ముఖ్యమంత్రి ఈరోజు భూమిపూజ చేశారు. 260 కోట్లరూపాయలతో రెండు దశల్లో ఆలయ ప్రాకారం, మహారాజగోపురం, ఆంజనేయస్వామి ఆలయాలు టిటిడి నిర్మించనుంది. మాడవీధులు, అన్నదాన భవన సముదాయం నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ 31 సెకన్లు

------------------------

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి పి.నారాయణ, శాసనసభ్యులు శ్రావణ్‌కుమార్‌లతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ఈరోజు మరోసారి సమావేశమైంది. అమరావతిలో సమావేశమైన త్రిసభ్య కమిటీ జరీబు–మెట్ట భూములు, గ్రామ కంఠాలు, అసైన్డ్, లంక భూముల రైతుల సమస్యల పరిష్కారం వంటి వివిధ అంశాలపై చర్చిస్తున్నారు. అలాగే గుంటూరు, మంగళగిరి నుంచి అమరావతికి నిర్మించనున్న రహదారుల అభివృద్ధిపైనా కమిటీ సభ్యులు చర్చించనున్నారు. ఇక ఈరోజు

సాయంత్రం రాజధాని రైతులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమావేశమై రైతులకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు.

---------------------------

పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఆర్ధికంగానూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఉపయోగపడుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో 106 మంది లబ్ధిదారులకు 55 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ,

వాయిస్ .. 28 సెకన్లు

---------------------------

నిడదవోలు పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలోని నిడదవోలు పురపాలక సంఘం వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ, నిరవద్యపురం నుండి నిడదవోలుగా రూపాంతం చెందిన ఈ పట్టణాన్ని స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. 131 కోట్ల రూపాయలతో నిడదవోలు నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకువచ్చే ప్రాజెక్టు, మాలకోడు చెరువు ఆధునికీకరణ, ప్రధాన రహదారుల అభివృద్ధి వంటివి చేపట్టనున్నామని తెలిపారు.

---------------------------

గోవాలోని పణాజీలో జరుగుతున్న 56వ అంతర్జాతీయ భారత చలనచిత్రోత్సవం – ఇఫీ చివరి దశకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ చిత్రాలతో పాటు ప్రాంతీయ చిత్రాలు ప్రదర్శితమవుతూ ప్రశంసలు పొందుతున్నాయి. చలనచిత్రోత్సవంలో ఈరోజు ఒరెండా, కాటన్ క్వీన్, ఎ పోయెట్, స్లీప్‌లెస్ సిటీ, ది ఉమెన్ సినిమాలను ప్రదర్శిస్తున్నారు. ప్రముఖ నటులు అమిర్ ఖాన్ “ది నేరేటివ్ ఆర్కిటెక్ట్ ఆఫ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అండ్ ఇన్‌క్లూజివిటీ” అనే అంశంపై మాస్టర్ క్లాస్‌ను నిర్వహిస్తారు. తెలుగు నటులు నాగార్జున ‘సేవింగ్ ది క్లాసిక్స్: శివాస్ జర్నీ’ అంశంపై చర్చిస్తారు. అలాగే ప్యాసా, గమన్, ఉమ్రావ్ జాన్, డాక్టర్ కోట్నీస్ కి అమర్ కహానీ వంటి క్లాసిక్ చిత్రాలు ప్రదర్శిస్తున్నారు.

---------------------------

కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నూతన కార్మిక చట్టాలు కార్మికులకు హక్కులతో పాటు వారి సంక్షేమానికి దోహదపడతాయని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ ప్రభుదత్త అన్నారు. విజయవాడలో ఈరోజు ఆయన మాట్లాడుతూ, గతంలో ఉన్న 29 చట్టాలను మార్పు చేసి నాలుగు కోడ్స్‌గా అమలు చేయడం వల్ల వ్యాపార సౌలభ్యాన్ని ప్రోత్సహించే సరళీకృత, సమర్థవంతమైన వ్యవస్థను సృష్టిస్తాయన్నారు. కార్మిక చట్టాల సంస్కరణలు కార్మికులకు సామాజిక భద్రత, ఆరోగ్య ప్రయోజనాలను సులభంగా పొందేందుకు ఉపయోగపడతాయని ఆయన తెలియజేస్తూ,

వాయిస్... 30 సెకన్లు

---------------------------

గోదావరి పుష్కరాలకు అనుగుణంగా తూర్పుగోదావరి జిల్లాలోని రహదారులను విస్తరించాలని రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కలెక్టర్ కార్యాలయంలో జాతీయ రహదారులు–గోదావరి డెల్టా మరమ్మతులపై సంబంధిత అధికారులతో నిన్న ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. పుష్కరాల సమయంలో నెలకొనే రద్దీకి అనుగుణంగా రహదారులను, పుష్కర ఘాట్లను విస్తరించాలన్నారు. రబీ పంట కాలం నేపథ్యంలో డెల్టా పరిధిలోని నీటి నిల్వలను, ఆయకట్టుపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని అధికారులకు సూచించారు.

-------------------------

తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ విజ్ఞాన శిక్షణ, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగిన "తూర్పు కనుమలు పరిరక్షణ, గుర్తింపు జాతీయ సదస్సు" ముగింపు కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తమిళనాడు వరకు విస్తరించిన తూర్పు కనుమలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం, తూర్పు కనుమల్లో జీవ వైవిధ్యం, భౌగోళిక పరిస్థితులపై పరిశోధనలు విస్తృత చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు. పడమట కనుమలకు ఉన్న గుర్తింపు లాగే తూర్పు కనుమలకు ప్రత్యేక గుర్తింపే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని వరల్డ్ వైజ్ ఫండ్ ఫర్ నేచర్ డెవలప్మెంట్ అధికారిణి ఫరీదా తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

-------------------------

నైరుతి బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో గుర్తించిన అల్పపీడనం అదే ప్రాంతంలో కొనసాగుతోందని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఇది ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ ఈరోజు వాయుగుండంగా బలపడే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడురోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొన్నారు.

=====================